**PROFESSOR JAYASHANKAR TELANGANA STATE AGRICULTURAL UNIVERSITY**
**Admn. Office, Rajendranagar, Hyderabad**

PRO/185/2018. తేది:06-12-2018

వి.సుధాకర్
పౌరసంబంధాల అధికారి

పత్రిక ప్రకటన

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, రెండవ స్నాతకోత్సవం ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి డా॥వి.ప్రవీణ్‌రావు తెలిపారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి మాజీ డైరెక్టర్ జనరల్ డా॥రాజేంద్రసింగ్ పరోడ ముఖ్యఅతిథిగా హాజరై స్నాతకోపన్యాసం చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ మరియు రాష్ట్ర గవర్నర్ శ్రీ ఈ.ఎస్.ఎల్.నరసింహ్మన్ అధ్యక్షతన జరిగే ఈ స్నాతకోత్సవంలో 2016-17 విద్యాసంవత్సరంలో పీజి, పిహెచ్.డి, డిగ్రీ పూర్తిచేసుకొన్న విద్యార్థులకు పట్టాలు ప్రధానం చేస్తారు. పీజి, పి.హెచ్.డి పూర్తిచేసిన 162 మందిలో 103 మంది విద్యార్థులు స్వయంగా హాజరై పట్టాలు అందుకోనున్నారు. అలాగే వ్యవసాయ, వ్యవసాయ ఇంజనీరింగ్, గృహవిజ్ఞాన డిగ్రీకి చెందిన 584 మందిలో 367 మంది స్వయంగా హాజరై పట్టాలు అందుకుంటారని వివరించారు. వ్యవసాయరంగంలో డా॥రాజేంద్రసింగ్ పరోడ అందించిన సేవలను గుర్తిస్తూ విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ సైన్సుతో సత్కరించనుంది.

వివిధ కోర్సులలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 10 మంది పిజి, పి.హెచ్‌డి విద్యార్థులు, 17 మంది యూజి విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తారు.

విశ్వవిద్యాలయం ఏర్పడిన అనతికాలంలోనే యూ.జి.సి గుర్తింపు, ఐ.సి.ఏ.ఆర్ అక్రిడేషన్ పొందడం జరిగిందన్నారు. విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మౌళిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా 3 వర్చ్యువల్ తరగతి గదులు, వివిధ కళాశాలలకు శాశ్వత భవనాల కల్పన, క్రీడా మైదానాల అభివృద్ధి, వసతి గృహాల నిర్మాణం తదితర పనులు చేపట్టామని వివరించారు. గడిచిన 4 ఏళ్ళలో వివిధ ముఖ్యమైన పంటలలో 15 కొత్త వంగడాలను విడుదల చేయడం జరిగిందన్నారు. విశ్వవిద్యాలయ పరిధిలో కొత్తగా మూడు వసాయ కళాశాలలు, పాలెం, వరంగల్, సిరిసిల్లలో ప్రారంభించడం జరిగిందని, నిజామాబాద్ జిల్లా రుద్రూరులో ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీని ప్రారంభించామని అన్నారు. అలాగే, కొత్తగూడెం, బెల్లంపల్లిలో రెండు కృషి విజ్ఞాన కేంద్రాలు నూతనంగా ప్రారంభించామన్నారు.

విశ్వవిద్యాలయంలో ఇటీవల 242 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీచేయడం జరిగింది. దీనివల్ల మెరుగైన బోధన, పరిశోధన, విస్తరణ కార్యక్రమాలు చేపట్టేందుకు దోహదం చేస్తుంది. అంతేకాకుండా పరిశోధన, విస్తరణ రంగాలలో విశ్వవిద్యాలయం చేసిన కృషికిగాను 2016-17 వార్షిక సంవత్సరంలో అవుట్‌స్టాండింగ్ మొక్కజొన్న పరిశోధనా కేంద్రం అవార్డుతోపాటు, బ్రీడర్‌సీడ్ ఉత్పత్తిలో మొక్కజొన్న ఎఐసిఆర్‌పి కేంద్రానికి అవార్డు లభించింది. అలాగే మొక్కజొన్న పరిశోధనలకు వాణిజ్య విలువలుకలిపించినందుకు గానూ ఉత్తమ సెంటర్‌గా గుర్తింపు లభించింది. వరంగల్‌లోని ఏఐసిఆర్‌ఐపి రైస్ కేంద్రానికి కూడా ఉత్తమ అవార్డు లభించింది.

నాణ్యమైన పరిశోధనలు ప్రోత్సహించి నందుకుగానూ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, 538 పరిశోధన వ్యాసాలను పీర్ రివ్యూడ్ జనరల్స్ ప్రచురించారన్నారు.

విశ్వవిద్యాలయంలో తీసుకొచ్చిన అనేక సంస్కరణలు దేశంలోని ఇతర విశ్వవిద్యాలయాలకు ఆదర్శంగా నిలిచాయి. 2016-17 సంవత్సరంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి ప్రకటించిన ర్యాంకులలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశంలోనే 12వ ర్యాంకును పొందింది. ఇటీవల ప్రకటించిన తాజా ర్యాంకులలో వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో దేశంలోనే రెండవ ర్యాంకును సాధించి ప్రగతి పథాన ముందుకు సాగుతోంది.

పౌరసంబంధాల అధికారి